సాక్షి తిరుపతి

శనివారం । 13 । మే । 2023



కులం చూడం.. మతం చూడం!

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. - IIలో



భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

మాడవీధుల్లో మహా అంగప్రదక్షిణ చేసే భక్తులకు ఇబ్బంది లేకుండా రాత్రివేళ పుష్కరిణిని తెరిచి ఉంచుతామని టీటీడీ ఈవో తెలిపారు. - IIలో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	41	28
చిత్తూరు	39	27
తిరుమల	37	24
గూడూరు	43	31
నగరి	42	28

న్యూస్‌రీల్

'సుందర తిరుమలే' లక్ష్యం



మాట్లాడుతున్న కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : తిరుమల కొండమార్గంలో పారిశుద్ధ్య చర్యల్లో భాగంగా చేపడుతున్న శుద్ధ తిరుమల .. సుందర తిరుమల కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో తిరుమల పారిశుద్ధ్యానికి సంబంధించి అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ శనివారం తిరుపతి అలిపిరి సర్కిల్ నుంచి రోడ్డు మార్గంతో పాటు కాలినడక మార్గంలోనూ పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రతి విభాగానికి చెందిన ఉద్యోగులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుమలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో అడుగులు వేస్తున్నట్లు వెల్లడించారు. తిరుమల మార్గంలో జిల్లా యంత్రాంగం తరఫున ప్రతి ఉద్యోగి భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. డీఆర్వో శ్రీనివాసరావు, డీఎఫ్‌వో సతీష్‌రెడ్డి, డీఈవో శేఖర్, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి భాస్కర్‌రెడ్డి, డీపీవో రాజశేఖర్ రెడ్డి, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి చెన్నయ్య, డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నేరం

తిరుపతి అర్బన్ : లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి హెచ్చరించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం 1994 లింగ నిర్ధారణ పరీక్షల నిరోధక చట్టంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చట్టాన్ని ఉల్లంఘించిన వారు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, సైగలు చేయడం, సూచనలు ఇవ్వడం తదితర ఏ అంశాలను దంపతులకు తెలియజేసినా డాక్టర్లపై శిక్షలు తప్పవన్నారు. తొలిసారి తప్పుచేస్తే మూడేళ్ల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా, రెండోసారి తప్పుచేస్తే ఐదేళ్ల జైలుశిక్ష, లక్ష రూపాయల జరిమానా ఉంటుందని స్పష్టం చేశారు. ఎవరైనా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు సమాచారం ఇస్తే ఆ సమాచారాన్ని గోప్యంగా ఉంచడమే కాకుండా వారికి నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. డాక్టర్‌పై కేసు నమోదైతే రూ.25 వేలు, కోర్టులో శిక్ష ఖరారైతే లక్ష రూపాయలు నగదు బహుమతి ఉంటుందని చెప్పారు. లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు సమాచారం ఉంటే 102, 104 టోల్‌ఫ్రీ నంబర్లకు తెలియజేయాలని ఆయన కోరారు. సమావేశంలో ఆరోగ్యశ్రీ డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, అడిషనల్ డీఎంహెచ్‌వో అరుణ సులోచనాదేవి, డీఎస్పీ కాటమరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సకల వసతులు

తిరుపతి అర్బన్ : ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం నాటికి సకల వసతులు కల్పించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పాఠశాలల వసతులకు సంబంధించి అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో వసతులతో పాటు నాణ్యమైన విద్య అందించేదిశగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలను గుర్తుచేశారు. పాఠశాల ప్రారంభం రోజే విద్యాకానుక సామగ్రితో పాఠశాలలకు పిల్లలు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాకు 400 కిచెన్ షెడ్లు మంజూరవగా అందులో 342 మాత్రమే పురోగతిలో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో 607 మంది బడిబయట పిల్లలను గుర్తించామని, వారంతా బడిలో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. డీఈవో శేఖర్, ప్లానింగ్ కో–ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి



ట్రోఫీతో సీఐ, నిర్వాహకులు, క్రీడాకారులు

నాయుడుపేటటౌన్ : అంతర్జాతీయ స్థాయిలో బ్యాడ్మింటన్ క్రీడకారులుగా రాణించాలని సీఐ నరసింహరావు ఆకాంక్షించారు. స్వర్ణముఖి నది సమీపంలో ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీ వారి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం రాత్రి రోలింగ్ చాంపియన్‌షిప్ అంతర్రాష్ట్రీయ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ నెల్లూరు, చెన్నై, బెంగళూరు వంటి పట్టణాలకు దీటుగా నాయుడుపేటలో ఉడెన్ ఇండోర్ షటిల్ కోర్టును ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కోర్టులో ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 60 జట్లు పాల్గొంటున్నట్టు తెలిపారు. రెండు రోజులు పాటు డే అండ్ నైట్ పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఏ నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మనసారె కొలిచితి!

దప్పు వాయిద్యాలు.. తప్పెట గుళ్లు, బ్యాండ్ మేళాలు, మంగళవాయిద్యాలు, కళాబృందాల ప్రదర్శనలు.. దేవతామూర్తుల వేషధారణలు.. భక్తుల తోటి వేషాలు.. ఊరంతా హోరెత్తిన సారెలు.. మమ్మేలు మాయమ్మ..గంగమ్మా..చల్లంగ చూడు తల్లీ నామస్మరణతో సాగిన ఊరేగింపులు.. తిరుపతిలో జాతర కోలాహలం ఉట్టిపడింది. చిన్నాపెద్దా తేడాలేకుండా.. తనమన తారతమ్యం లేకుండా సారెలు సమర్పించి.. గంగమ్మను దర్శించి పులకించిపోయారు.

- తాతయ్యగుంట గంగమ్మకు పోటెత్తిన సారెలు
- సామాన్యుల నుంచి సర్కారు వరకు సారె సమర్పణ
- పాల్గొన్న జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సినీ నటుడు
- కళాబృందాల ప్రదర్శనతో హోరెత్తిన తిరుపతి నగరం



ప్రభుత్వం తరఫున సారె సమర్పిస్తున్న కలెక్టర్



మున్సిపల్ కార్యాలయం తరఫున సారె సమర్పిస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత

సాక్షి, తిరుపతి: తాతయ్యగుంట గంగమ్మకు ఊరు ప్రజలందరూ కలిసి శుక్రవారం సారె సమర్పించారు. సామాన్యుడి నుంచి సర్కారు వరకు శ్రీవారి చెల్లెలు గంగమ్మకు ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా తిరుపతి తాతయ్యగుంట గంగ జాతర అంగరంగ వైభవంగా సాగుతోంది. ఏడుకొండల్లో కొలువైన శ్రీనివాసుని చెలెలు గంగమ్మకు ప్రభుత్వ, టీటీడీ నిధులతో నూతనంగా ఆలయాన్ని నిర్మించారు. ఆలయ మహాకుంభాభిషేకానికి పీఠాధిపతులు రావడం.. ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించడం గంగ జాతర ప్రాధాన్యత సంతరించుకుంది. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చొరవతో జరుగుతున్న జాతరకు విశేష ఆదరణ లభిస్తోంది. శుక్రవారం ఊరు ఊరంతా.. సారె సమర్పించింది. ప్రభుత్వం తరుపున ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, వివిధ శాఖల అధికారులు గాంధీ విగ్రహం నుంచి ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సారె సమర్పించారు. శ్రీకాళహస్తీశ్వరుని తరుపున ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు, పాలక మండలి సభ్యులు గంగమ్మకు సారె సమర్పించి పూజలు నిర్వహించారు. తిరుపతి నగరపాలక సంస్థ తరుపున మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి సారె సమర్పించారు.



ఆకట్టుకున్న కొమ్ము నృత్యం

మేయర్ డాక్టర్ శిరీష ప్రత్యేకంగా కుటుంబ సమేతంగా వెళ్లి సారె సమర్పించారు. పోలీసుశాఖ తరుపున ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, నగరంలోని కార్పొరేటర్లు వేర్వేరుగా సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సినీ నటుడు కిరణ్ వేషాలమ్మకు, గంగమ్మకు సారె సమర్పించారు. నగర వాసులు ఎవరికి వారు వివిధ వేషధారణలో అమ్మవారికి సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపులో దప్పు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డెప్యూటీ మేయర్ భూమన అభినయ్ దప్పుకొట్టి అందర్నీ ఉత్సాహపరిచారు.



దప్పు కొడుతున్న డెప్యూటీ మేయర్ అభినయ్



ఊరేగింపుగా సారె తీసుకెళ్తున్న ఎమ్మెల్యే, మేయర్, డెప్యూటీ మేయర్, కమిషనర్



ఆలయం వద్ద శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్, సభ్యులు



పోలీస్ శాఖ తరఫున సారె సమర్పిస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

ముక్కంటి.. వసతులు మిన్నంటి!

జిల్లాలో ప్రఖ్యాత శైవక్షేత్రమైన శ్రీకాళహస్తి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తుల్లో 80 శాతం ఇక్కడికి వచ్చి ముక్కంటీశుని దర్శించుకుంటున్నారు. స్వామి, అమ్మవార్లకు మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ అధికారులు మెరుగైన సౌకర్యాలను సమకూర్చుతున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా ఆలయాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. ఎక్కడా లోటుపాట్లకు తావులేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ భక్తుల మన్ననలు అందుకుంటున్నారు.

- వేసవి సెలవులతో శ్రీకాళహస్తి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు
- నిత్యం 30 వేల నుంచి 40 వేల మందికి దర్శనభాగ్యం
- గతం కంటే మెరుగుపడ్డ సౌకర్యాలు



ఆలయంలో భక్తుల రద్దీ



నూతనంగా ఏర్పాటు చేసిన కార్ పార్కింగ్

రేణిగుంట: శ్రీకాళహస్తీశ్వరాలయానికి నెల రోజులుగా భక్తుల తాకిడి పెరిగింది. సగటున రోజుకు 30 వేల నుంచి 40వేల మంది భక్తులు దర్శించుకుంటున్నారు. శని, ఆది, సోమవారాల్లో సంఖ్య 50 వేలకు పైగా ఉంటోంది. భక్తుల కోసం అతిథి గృహాల్లో 200 వరకు అద్దె గదులను భక్తుల కోసం సమకూర్చారు. ఇవిగాక మరో 500 వరకు ఉచిత డార్మెటరీలు ఉన్నాయి. ప్రధానంగా ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఎండ వేడిమి తగలకుండా చలువ పందిళ్లను నిర్మించారు. దర్శనం కోసం వెళ్లే భక్తులకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేసి కూలర్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. అలాగే క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు మంచినీరు, మజ్జిగ, చంటి బిడ్డలకు వేడి పాలు అందజేస్తున్నారు.

విశేష పూజలివే

వాయులింగ క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీకాళహస్తీశ్వరాలయంలో రోజూ రాహు–కేతు సర్పదోష నివారణ పూజలతో పాటు ప్రతి మంగళవారం కాలభైరవుని ఉత్సవాలు, ప్రతి శుక్రవారం అమ్మవారి మనోర్మణి ఉత్సవం, ప్రతి అమావాస్యకు స్వామి, అమ్మవార్ల నగరోత్సవం, ప్రతి పౌర్ణమికి ఊంజల్ సేవ, సంకటహర చతుర్దసికి గణపతి హోమం, ఆదివారం ఉదయం 6గంటలకు ఆదిత్యుడు (సూర్యభగవానుడు) అభిషేకం, శనిత్రయోదశికి ఆలయంలోని శనీశ్వరునికి విశేష అభిషేక పూజలు, రోజూ నాలుగు కాలాల్లో స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహిస్తున్నారు.

వెండి నాగపడిగల కొరతకు శాశ్వత పరిష్కారం

ఇక్కడ జరిగే రాహు–కేతు ప్రదోష పూజల్లో ప్రధానంగా వినియోగించే వెండి నాగపడిగల కొరత గతంలో తరచూ వేధించేది. స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చొరవతో అదనంగా వెయ్యి కిలోల వెండిని కొనుగోలు చేసి కరిగించి నిత్యం 30 వేలకు పైగా వెండి నాగపడగలు స్టాకు ఉండేలా ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు చర్యలు చేపట్టారు. దీంతో నాగపడిగల కొరతకు శాశ్వత పరిష్కారం లభించింది.

కావాల్సినన్ని ప్రసాదాలు

భక్తులకు స్వామి, అమ్మవారి ప్రసాదాలను అందజేసేందుకు రోజూ సగటున 20వేల నుంచి 25 వేల ప్రసాదాలు(లడ్డూ, వడ, పులిహోరా, జిలేబీ తదితరాలు) తయారు చేస్తున్నారు. అలాగే అన్నదాన సత్రంలో మధ్యాహ్నం సగటున 7వేల మంది, రాత్రి 3 వేలమంది భక్తులకు అన్నదానం చేస్తున్నారు.

సామాన్య భక్తులకు శీఘ్ర దర్శనం



సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శీఘ్ర దర్శనం కల్పించడమే లక్ష్యం. అన్ని విభాగాల్లో పర్యవేక్షిస్తూ ఆలయ పాలనను గాడిలోకి తీసుకొచ్చాం. దళారీ వ్యవస్థను అరికట్టాం. అభివృద్ధిని చూసి భక్తులే స్వచ్ఛందంగా విరాళాలు అందిస్తున్నారు.

– అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ చైర్మన్

పకడ్బందీగా ఏర్పాట్లు



స్వామి, అమ్మవార్ల దర్శనానికి భక్తులు ఈ వేసవిలో అధిక సంఖ్యలో వస్తున్నారు. వారందరికీ దర్శన భాగ్యం కల్పించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాం. రాహు–కేతు పూజల్లో అక్రమాలకు తావులేకుండా ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశాం. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లను ఏర్పాటు చేశాం. – సాగర్‌బాబు, ఈఓ

జన బాహుళ్యంలోకి

అన్నమయ్య సంకీర్తనలు



అన్నమయ్య సంకీర్తన లహరి గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఈవో ధర్మారెడ్డి

తిరుమల: పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య సంకీర్తనలను అర్థ తాత్పర్యాలతో ప్రజలందరికీ చేరువ చేసేందుకు టీటీడీ కృషి చేస్తోందని టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి తెలిపారు. తాళ్లపాక అన్నమాచార్యుల 614వ జయంతిని పురస్కరించుకొని తిరుమల అన్నమయ్య భవన్‌లో శుక్రవారం 'అన్నమయ్య సంకీర్తన లహరి గ్రంధం –2 ' ను ఈవో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాళ్లపాక అన్నమయ్య శ్రీవారిపై 32 వేలకు పైగా సంకీర్తనలు రచించినట్లు తెలిపారు. అన్నమయ్య సంకీర్తనలలో ప్రతి సంకీర్తనకు అర్థ తాత్పర్యాలు, ఆ సంకీర్తన ఏ సందర్భంలో రాశారు, మూలం ఏమిటి అనే విశేష అంశాలు తెలిస్తే గాయకులు భావయుక్తంగా ఆలపిస్తారన్నారు. శ్రీవారి అనుగ్రహంతో 1922 నుంచి 2022 వరకు అంటే దాదాపు వంద సంవత్సరాల తర్వాత అన్నమయ్య రచించిన సంకీర్తనలకు అర్థ, తాత్పర్యాలతో భక్తుల ముందుకు తీసుకువచ్చే అవకాశం కలిగిందన్నారు. 16 మంది నిష్ణాతులైన ప్రముఖ పండితులు అన్నమయ్య సంకీర్తనలకు అర్థ తాత్పర్యాలు, విశేష అర్థాలను సమకూర్చారని చెప్పారు. జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్‌వో నరసింహ కిషోర్, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు డాక్టర్ విభీషణశర్మ, టీటీడీ ఆస్థాన విద్వాంసులు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్, ప్రముఖ పండితులు సర్వోత్తమరావు, శ్యామలానందప్రసాద్, పేరం నాయుడు, ఆచార్య రామకృష్ణ, గ్రంథ రచనకు ఆర్థిక సహకారం అందించిన గ్రంధి రాజేష్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవం..బ్రహ్మాండం

- వేడుకగా వేదనారాయణుని చక్రస్నానం
- ఆగమోక్తంగా ధ్వజావరోహణం
- బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం



పల్లకీపై ఊరేగుతున్న వేదనారాయణ స్వామి



పుష్కరిణిలో వేడుకగా చక్రస్నానం

పిచ్చాటూరు: నాగలాపురం వేదనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగాయి. ఇందులో భాగంగా శుక్రవారం సాయంత్రం ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. ఉత్సవాల ఆఖరి రోజున ఉదయం ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యకైంకర్యాలనంతరం వేదనారాయణుడిని పల్లకీపై ఆశీనులను చేసి తిరువీధుల్లో ఊరేగించారు. ఆలయానికి చేరిన స్వామిపై అలక వహించిన శ్రీదేవి, భూదేవిలు స్వామిని ఏకాంత మండపంలోకి రానీయకుండా తలుపులు మూసివేశారు. కల్యాణోత్సవానంతరం సతులకు చెప్పకుండా స్వామి ఒంటరిగా వెళ్లడంతో ఉభయనాంచారీలు సంవాదానికి దిగారు. ఈ సందర్భంగా దేవేరులు, స్వామి తరపున వేర్వేరుగా అర్చకులు నిలబడి లక్ష్మీసంవాద ఘట్టాన్ని ఆగమానుసారం నడిపించి భక్తులను మైమరిపించారు. అనంతరం ఉభయనాంచారీలతో పాటు ప్రత్యేకంగా చక్రతాళ్వార్‌తో కలిసి స్వామి తిరుచ్చిపై ఆలయ పుష్కరణికి ఊరేగింపుగా వెళ్లగా.. అక్కడ సిద్ధం చేసిన పీఠంపై శ్రీదేవి, భూదేవి, చక్రతాళ్వార్, వేదనారాయణులకు అర్చకులు పాలు, పెరుగు, తేనె, చందనం, నారికేళ జలాలతో అభిషేకాలు చేసి సహస్రధార కలశాభిషేకాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవ సందేశాన్ని అష్టదిక్పాలకులు, సకల దేవగణాలకు నిత్యం అందించి అలసిన సుదర్శన చక్రానికి స్నపన తిరువంజనం, చక్రస్నానం చేయించారు. రాత్రి ఉభయ దేవేరులతో కలిసి తిరువీధి ప్రదక్షిణ చేసిన అనంతరం స్వామి సమక్షంలో ఆలయ ధ్వజస్తంభంపైన గరుడ ధ్వజపటాన్ని అవరోహణ చేయడంతో బ్రహ్మోత్సవాలు ముగిసినట్టయ్యింది.

నేడు వసంతోత్సవం

నాగలాపురం శ్రీ వేదనారాయణుని వసంతోత్సవం శనివారం సాయంత్రం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగియడంతో సిబ్బంది మోతగాళ్లు పసుపు, చందనం, పచ్చకర్పూరం, కుంకుమలో సుగంధద్రవ్యాలను కలిపిన మిశ్రమంతో వసంతాలు చల్లుకుంటారు. సాయంత్రం 7 గంటలకు ఆలయంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేదనారాయణ స్వామిని శ్వేత వస్త్రాలతో అలంకరించి తిరుచ్చి వాహనంపై ఆశీనులు చేసి తిరువీధుల్లో ఊరేగించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు ఏర్పాట్లు చేపట్టినట్టు వారు పేర్కొన్నారు.

క్లుప్తంగా

తెలుగుగంగ కాలువలో వ్యక్తి మృతదేహం



నాయుడుపేట టౌన్: మండలంలోని పుదూరు పంచాయతీ గొల్లపల్లి గుంట సమీపంలో తెలుగుగంగ కాలువల్లో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చింది. వీఆర్వో సమాచారంతో సీఐ నరసింహరావు, ఎస్ఐ కృష్ణయ్య అక్కడికి చేరుకుని పరిశీలించారు. అతనికి సుమారు 35 ఏళ్లు ఉంటాయని, కట్ బనియన్ ధరించి ఉన్నాడని తెలిపారు. బహిర్భూమికి వెళ్లి కడుక్కునేందుకు తెలుగు గంగలో కాలువలో దిగి కొట్టుకుని వచ్చి ఉంటాడని అనుమానిస్తున్నారు. శ్రీనివాసపురం గ్రామ సమీపంలోని తెలుగుగంగ కాలువలో వద్ద ప్యాటు, షర్టు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో పుదూరు పంచాయతీలోని గ్రామాల వాసులను పిలిపించి విచారించారు. ఆచూకీ తెలియకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రూపేష్ కోసం గాలింపు చర్యలు



గంగ కాలవ వద్ద గాలిస్తున్న సీఐ మల్లికార్జున

తొట్టంబేడు(రేణిగుంట): మండలంలోని గురుకులపాళెంకు చెందిన రూపేష్ గురువారం రాత్రి తెలుగుగంగ కాలువలో ఈత కోసమని దిగి కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. అతని ఆచూకీ కోసం టూటౌన్ సీఐ మల్లికార్జున, ఎస్ఐ మహేష్, సమీప గ్రామస్తుల ఆధ్వర్యంలో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ప్రమాదం జరిగి ఇరవైనాలుగు గంటలవుతున్నా బాలుడి అచూకీ తెలియకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

కులం చూడం... మతం చూడం!

- రాజకీయం అసలే చేయం..
- అర్హతే ప్రామాణికం
- ఓటు వేసినా.. వేయక పోయినా
- గడపగడప మహాపాదయాత్రలో మోహిత్‌రెడ్డి



మోహిత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ముస్లిం మహిళలు



మదక దున్నుతున్న మోహిత్‌రెడ్డి

భాకరాపేట : 'కులం చూడం... మతం చూడం... రాజకీయం అసలే చేయం.. అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందిస్తాం'అని చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. చిన్నగొట్టిగల్లు మండల కేంద్రంలో శుక్రవారం గడపగడపకు మహా పాదయాత్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఓటు వేసినా వేయక పోయినా నియోజకవర్గ ప్రజలందరికీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి బాధ్యతగా వ్యవహరించారన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయం.. మిగిలిన సమయంలో ప్రజాసేవకే ఆయన పునరంకితమయ్యారని చెప్పారు. అందరినీ సమానంగా, కుటుంబ సభ్యుల్లా భావించారని తెలిపారు. కరోనా సమయంలో నియోజకవర్గంలోని 1.6 లక్షల కుటుంబాలకు తోడుగా నిలిచారని చెప్పారు. 2024 ఎన్నికల్లో సీఎం జగనన్నను, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ఆశీర్వదించాలని కోరారు.

పల్లెల ప్రగతి

మండల కేంద్రమైన చిన్నగొట్టిగల్లు పంచాయతీ పరిధిలో రూ.12.59 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. సంక్షేమ పథకాల కింద రూ.30.61 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, జెడ్పీటీసీ స్వరూప, సర్పంచ్ మనోహర, మండల పార్టీ అధ్యక్షుడు కొండారెడ్డి, గృహసారథుల మండల కన్వీనర్ ఖదీర్‌అహ్మద్, పార్టీ డివిజన్ అధ్యక్షుడు అక్బర్, మాజీ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, లోకనాథరెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ అన్వర్‌బాషా, సచివాలయ కన్వీనర్లు రమణ, ద్వారకనాథరెడ్డి, ఇర్షాద్ పాల్గొన్నారు.

దాడి కేసులో వ్యక్తి అరెస్ట్

తిరుపతి రూరల్: స్నేహితుడి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్లి ఒకరిపై రాళ్లతో దాడి చేయడమే కాకుండా మరోవ్యక్తిని కత్తితో పొడిచిన కేసులో ముద్దాయి ఫైరోజ్‌ను శుక్రవారం ఎంఆర్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఫైరోజ్ పాత ముద్దాయి అని, అతనిపై ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులు కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎంఆర్‌పల్లి సీఐ సురేంద్రరెడ్డి తెలిపారు. ఇదిలావుంటే కత్తిపోట్లకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విజ్ఞాన్‌వర్మ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని స్విమ్స్ వైద్యులు ప్రకటించారు.



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,760
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,606
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,000
రిటైల్ వెండి గ్రాము	రూ.76.00

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు





అమ్మవారి ఆలయం ఎదుట మంత్రి ప్రహ్లాద్ జోషి, మఠాధిపతి జగద్గురు శ్రీరామానుజాచార్యులు

తిరుచానూరు (చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కేంద్ర యూనియన్ మినిస్టర్ ప్రహ్లాద్ జోషి, శ్రీయదుగిరి యతిరాజ్ మఠాధిపతి జగద్గురు శ్రీరామానుజాచార్యులు వేర్వేరుగా అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆశీర్వాద మండపంలో పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

4.1 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న సీఐ ప్రసాద్

నాయుడుపేటటౌన్: స్థానిక బస్టాండ్ వద్ద అక్రమంగా తరలిస్తున్న ఓ యువకుడి నుంచి 4.1 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్‌యూవీఎస్ ప్రసాద్ తెలిపారు. ఎస్ఈబీ కార్యాయంలో ఆయన వివరాలు వెల్లడించారు. సిబ్బంది నాయుడుపేట ఆర్టీసీ బస్టాండు వద్ద బస్సులను తనిఖీ చేస్తుండగా ఓ యువకుడు అనుమానాస్పదంగా ఉండడంతో అతన్ని పట్టుకుని విచారించగా గంజాయి బయటపడిందన్నారు. పట్టుబడిన యువకుడు విశాఖపట్నం పెందుర్తి పట్టణానికి చెందిన గుజ్జారిసాగర్‌గా గుర్తించినట్టు వెల్లడించారు. డిప్లొమో వరకు చదువుకున్న సాగర్ చేడు అలవాట్లకు బానిసై కాకినాడ ప్రాంతానికి చెందిన వినోద్‌తో కలిసి గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్టు తెలిపారు. ఈక్రమంలో వినోద్ అరకులో కొనుగోలు చేసి ఇచ్చిన 4.1 కిలోల గంజాయిని సాగర్ బ్యాగులో పెట్టుకుని బెంగళూరుకు అక్రమంగా తరలిస్తూ పట్టుబడినట్టు సీఐ తెలిపారు. దీనివిలువ రూ.70 వేలు ఉంటుందన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, సాగర్‌తో పాటు వినోద్‌పై కూడా కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

పోటాపోటీగా ఫుట్‌బాల్ పోటీలు



నువ్వా..నేనా అన్నట్టు తలపడుతున్న క్రీడాకారులు

నాయుడుపేటటౌన్ : సౌత్‌ఇండియా స్థాయి ఫుట్‌బాల్ పోటీలు పోటాపోటీగా సాగుతున్నాయి. స్థానిక ఏఎల్‌సీఎం క్రీడామైదానంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల తోపాటు కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ఫుట్‌బాల్ క్రీడాకారులు నువ్వా..నేనా అన్నట్టు తలపడుతున్నారు. నాయుడుపేట ఫుట్‌బాల్ క్లబ్‌కు చెందిన కాళహస్తి భవాన్ అనుదీప్, కోచ్ గౌస్, సభ్యులతోపాటు విశాఖపట్నానికి చెందిన రెఫరీలు గోవిందు, బాబు, రమేష్, శీను తదితరులు పోటీలను సజావుగా జరిగేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

రెండో రోజు విజేతలు

రెండో రోజు హైదారాబాద్ –చెన్నై అనిల్ లెవన్స్ జట్టు, హుబ్లీ– కేరళ జట్టు, నాయుడుపేట– విశాఖపట్నం జట్టు, బిట్రగుంట– హైదారాబాద్ ఫలక్‌నామా జట్ల మధ్య పోటీలు జరగగా.. హైదారాబాద్, హుబ్లీ, విశాఖప ట్నం, హైదారాబాద్ ఫలక్‌నామా జట్లు విజేతలుగా నిలిచాయి.

నేడు క్వార్టర్ ఫైనల్స్

శనివారం జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో నాలుగు జట్లు తలపడనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. తిరుపతి–చెన్నై సీటీ పోలీస్, నెల్లూరు– చెన్నై మీంజుర్ క్లబ్, హుబ్లీ– ఫలక్‌నామా హైదారాబాద్, సికింద్రాబాద్–విశాఖపట్నం జట్ల మధ్య పోటీలు జరుగుతాయన్నారు.. 14వ తేదీన ఫైనల్ పోటీలు ఉంటాయని నిర్వాహకులు వెల్లడించారు.

పరిపాలనాధికారిగా ప్రసన్నకుమార్‌రెడ్డి



తిరుపతి లీగల్ : రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ కోర్టు పరిపాలనాధికారి (చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)గా ఎల్.ప్రసన్నకుమార్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఎర్రచందనం కేసుల పరిష్కారం కోసం ప్రభుత్వం గత ఏడాది తిరుపతిలో కోర్టు ఏర్పాటుచేసింది. మొట్టమొదటి పరిపాలనాధికారిగా ఎల్.ప్రసన్నకుమార్‌రెడ్డిని రాష్ట్ర హైకోర్టు ఏర్పాటుచేయడం విశేషం. ఆయన ఇదివరకు కడప 7వ అదనపు జిల్లా జడ్జి కోర్టు సీఏఓగా విధులు నిర్వహించేవారు. రాష్ట్ర హైకోర్టు కడప నుంచి తిరుపతి ఎర్రచందనం విచారణ కోర్టుకు బదిలీచేయడంతో శుక్రవారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఎల్.ప్రసన్నకుమార్‌రెడ్డి ఇదివరలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ కోర్టులలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించారు. ఆయన బాధ్యతలు తీసుకున్న సందర్భంగా తిరుపతిలో వివిధ కోర్టులకు చెందిన సిబ్బంది, న్యాయవాదులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

గంగ కాలువలో పడి బాలుడి మృతి



పవన్‌తేజ్ (ఫైల్)

సత్యవేడు: సదవాలమ్మ గుడి సమీపంలోని గంగకాలువలో పవన్‌తేజ్(4) నీట మునిగి మృతి చెందాడు. బంధువుల కథనం.. శుక్రవారం సదవాలమ్మ ఆలయం వద్ద పొంగళ్లు పెట్టేందుకు సత్యవేడు తంబుశెట్టి వీధికి చెందిన పమ్మి.రవికుమార్, భార్య జయశ్రీ బంధువులతో కలిసి వెళ్లారు. గుడి వద్ద పొంగలి పెడుతుండగా బంధువులు గంగ కాలువలో దుస్తులు శుభ్రచేసుకొనేందుకు దిగారు. వారి వెంట రవికుమార్ కుమారులు లోహిత్(6), పవన్ తేజ్(4) కూడా వెళ్లారు. గంగ కాలువలో దిగడంతో నీటి ఉధృతికి ఇద్దరూ మునిగిపోయారు. సమీపంలో ఉన్న మహిళలు గుర్తించి కేకలు వేయడంతో యువకులు గంగ కాలువలో కొట్టుకుపోతున్న లోహిత్‌ను కాపాడి ఒడ్డుకు చేర్చారు. తర్వాత పవన్‌తేజ్‌ను గుర్తించగా.. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానిక కమ్యూనిటీ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే పవన్‌తేజ్ మృతిచెందాడని నిర్ధారించారు. తల్లిదండ్రుల రోదనలతో ఆస్పత్రి ప్రాంగణం దద్దరిల్లింది.

లారీ ఢీకొని యువకుడి మృతి



సంతోష్(ఫైల్)



మృత దేహాన్ని ఏరియా అస్పత్రికి తరలిస్తున్న ఎస్ఐ రాఘవేంద్ర

తొట్టంబేడు(రేణిగుంట): తొట్టంబేడు మండలం, తంగెళ్లపాలెం వద్ద ఘోరరోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. లారీ అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్ఐ రాఘవేంద్ర కథనం.. మండలంలోని బీడీ కాలనీకి చెందిన వెంకటేష్, రేఖ దంపతుల కుమారుడు సంతోష్ (18) రైతు కూలీ.. ద్విచక్ర వాహనంపై కూలి పనుల నిమిత్తం బుచ్చినాయుడు కండ్రిగ మండలానికి వెళ్తుండగా.. మార్గమధ్యంలోని తంగేళ్లపాళెం వద్ద లారీ అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంతోష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. లారీని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

అన్నమయ్య సంకీర్తనల్లో వేద విజ్ఞానసారం

తిరుపతి కల్చరల్: అన్నమయ్య సంకీర్తనల్లో వేద విజ్ఞానసారం ఇమిడి ఉందని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆచార్యుడు మలయ వాసిని తెలిపారు. అన్నమాచార్య కళామందిరంలో చేపట్టిన అన్నమయ్య జయంతి ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాహితీ సదస్సులో ఆయన అన్నమయ్య ఆధ్యాత్మికత కీర్తనలు అనే అంశంపై ఉపన్యసించారు. ఆనాటి రాజకీయ కాలమాన పరిస్థితుల కారణంగా ప్రజల్లో అడుగంటిన భక్తి భావాన్ని చైతన్య పరచి ఆధ్యాత్మిక సమైక్యత సాధించేందుకు శ్రీవేంకటేశ్వరస్వామిని కేంద్రంగా చేసుకుని సంకీర్తనలు రచించారన్నారు. రాజమండ్రి ఆంధ్ర యువతి సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ పేరం నాయుడు అన్నమయ్య పద కవితా ధోరణి అనే అంశంపై ప్రసంగించారు. హైదరాబాద్‌కు చెందిన జీఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ ఆచార్య సముద్రాల రంగ రామానుజాచార్యులు అన్నమయ్య కీర్తనలు –రామానుజాచార్యులు అనే అంశంపై ప్రసంగించారు. ఉదయం 8.30 గంటలకు కోదండరామస్వామి ఆస్థానం ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఆలపించిన గోష్టిగానం అలరించింది. సాయంత్రం సరస్వతీ ప్రసాద్, రాజేష్‌కుమార్ బృంద సంగీత సభ, రాత్రి జంధ్యాల కృష్ణకుమారి బృందం హరికథా గానం ఆకట్టుకున్నాయి. అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు విభీషణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అద్దెకు ఆర్టీసీ దుకాణాలు

తిరుపతి అర్బన్ : ఆర్టీసీ బస్టాండ్ పరిధిలో ఖాళీగా ఉన్న దుకాణాలను అద్దెకు ఇవ్వడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీపీటీఓ చెంగల్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో 94 దుకాణాలకు దరఖాస్తు చేసుకోవడానికి టెండర్లు నిర్వహిస్తున్నామని, ఈనెల 18వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. అదేరోజు మూడు టెండర్లు ఖరారుచేయనున్నట్టు వెల్లడించారు. అదనపు సమాచారం కోసం వ్యాపారులు 9959225684 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

జిల్లాలో ఖాళీగా ఉన్న దుకాణాల వివరాలు

ప్రాంతం	ఖాళీగా ఉన్న దుకాణాలు
తిరుపతి శ్రీహరి బస్టాండ్	- 13
తిరుపతి శ్రీనివాస బస్టాండ్	- 13
తిరుపతి ఏడుకొండల బస్టాండ్	- 02
తిరుపతి కమర్షియల్ కాంపెక్స్	- 08
భాకరాపేట బస్టాండ్	- 03
పుత్తూరు	- 01
శ్రీకాళహస్తి	- 07
సత్యవేడు	- 01
వరదయ్యపాలెం	- 01
కోట	- 10
నాయుడుపేట	- 09
గూడూరు	- 03
వెంకటగిరి	- 06
రేణిగుంట	- 02
రంగంపేట	- 02
చంద్రగిరి	- 01
పాకాల	- 06
నేండ్రగుంట	- 01
ఏర్పేడు	- 01
నాగలాపురం	- 04

శ్రీవారి దర్శనానికి 24 గంటలు



తిరుమల: తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్టుమెంట్లు అన్నీ నిండాయి. క్యూ వెలుపల టీబీసీ వద్దకు చేరుతుంది. గురువారం అర్ధరాత్రి వరకు 67,381 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 33,381 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.19 కోట్లు భక్తులు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

మహా అంగప్రదక్షిణ భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

డయల్ యువర్ ఈవోలో ఏవీ.ధర్మారెడ్డి

తిరుమల: శ్రీవారి ఆలయ మాడవీధుల్లో మహా అంగప్రదక్షిణ చేసే భక్తులకు ఇబ్బంది లేకుండా రాత్రివేళ పుష్కరిణిని తెరిచి ఉంచుతామని, తిరుమలనంబి ఆలయం వద్ద గేటు తీసి ఉంచి సెక్యూరిటీ గార్డును ఏర్పాటు చేస్తామని టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో భక్తుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న : అంగప్రదక్షిణ టోకెన్లు ఆన్‌లైన్‌లో 2 మాత్రమే బుక్ అవుతున్నాయి. 4కు పెంచండి. – అపర్ణ, అనంతపురం

ఈవో : ఒక భక్తుడు రెండు టికెట్లు మాత్రమే బుక్ చేసుకునే అవకాశం ఉంది. ఈ టోకెన్లు పొందలేని వారు ఇతర విధానాల్లో దర్శనం చేసుకోవచ్చు. ప్రతినెలా 18 నుంచి 20వ తేదీ వరకు ఆర్జిత సేవల లక్కీ డిప్ కోసం నమోదు చేసుకోవచ్చు. 20 నుంచి 22వ తేదీ వరకు డిప్‌లో టికెట్లు పొందిన వారు సొమ్ము చెల్లించి ఖరారు చేసుకోవాలి. ఇతర ఆర్జిత సేవా టికెట్లు 21న విడుదల చేస్తారు. శ్రీవాణి, అంగప్రదక్షిణం, వృద్ధులు, దివ్యాంగుల దర్శన టికెట్లు 23న విడుదలవుతాయి. అదేవిధంగా రూ.300 దర్శన టిక్కెట్ల కోటాను 24న, గదుల కోటాను 25న విడుదల చేస్తాం.

ప్రశ్న : కల్యాణోత్సవానికి పిల్లలను అనుమతి ఇస్తారా.– శ్రీనివాస్, చిలకలూరిపేట

ఈవో : శ్రీవారి ఆలయంలో కల్యాణ మండపం వద్ద స్థలం తక్కువగా ఉన్న కారణంగా ఎక్కువ మందిని అనుమతించే అవకాశం లేదు. మైనర్లను తల్లిదండ్రులతో పాటు అనుమతిస్తాం.

ప్రశ్న : కోవిడ్‌లో ఆర్జిత సేవా టికెట్లు బుక్ చేసుకున్న వారికి బ్రేక్ దర్శనం టికెట్లు ఇస్తామని చెప్పారు. అలా కాకుండా అర్చన, తోమాల లాంటివి ఇవ్వండి. – వెంకటేశ్వర్లు, పీలేరు

ఈవో : ఆర్జిత సేవా టికెట్లు అడ్వాన్స్ బుకింగ్ షెడ్యూల్ చేయడం కష్టమవుతుంది. తోమాల, అర్చన లాంటి సేవల కోసం లక్కీడిప్‌లో ప్రయత్నించండి.

ప్రశ్న : శ్రీవారి సేవాసదన్‌లో రిజిస్ట్రేషన్ ఆలస్యం అవుతోంది. – నరసయ్య, ఆదిలాబాద్

ఈవో : ఇకపై ఆ సమస్య లేకుండా చేస్తాం.

ప్రశ్న : అలిపిరి కాలినడక మార్గంలో స్తంభాలకు గోవింద నామాలు ఉండేవి, తిరిగి రాయించండి. – వంశీ, బాపట్ల

ఈవో : అలిపిరి కాలినడకమార్గం పునర్నిర్మించాం. నూతన స్తంభాలకు గోవింద నామాలు రాయిస్తాం.

ప్రశ్న : ధర్మ ప్రచారం చేసేందుకు ప్రతి మండలంలోనూ సేవా కేంద్రం పెట్టండి. – గుప్తా, ప్రకాశం

ఈవో : హిందూ ధర్మ ప్రచార పరిషత్ ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

ప్రశ్న : మహా అంగప్రదక్షిణ చేయడానికి ఇబ్బందికరంగా రాత్రివేళ పుష్కరిణిని మూసేస్తున్నారు, తిరుమలనంబి ఆలయం వద్ద గేటు వేస్తున్నారు. – అశోక్, చెన్నై

ఈవో: మహా అంగప్రదక్షిణ చేసే భక్తులకు స్నానానికి ఇబ్బంది లేకుండా రాత్రి వేళ పుష్కరిణిని తెరిచి ఉంచుతాం. తిరుమలనంబి ఆలయం వద్ద గేటు లేకుండా చూస్తాం.

ప్రశ్న : గదుల తాళాలు ఇచ్చినప్పటి నుంచి సమయం లెక్కించేలా చూడండి. – పార్థసారథి, విజయనగరం

ఈవో : పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : లడ్డూ నాణ్యత సరిగా ఉండడం లేదు. అన్నదానంలో బియ్యం నాణ్యత సరిగా లేదు. – వెంకట్, కాకినాడ

ఈవో : లడ్డూ తయారీకి నాణ్యమైన ముడి సరుకులను టెండర్ ద్వారా కొనుగోలు చేస్తున్నాం. మరింత నాణ్యంగా ఉండేలా పోటు సిబ్బందికి సూచనలు ఇస్తాం. అన్నదానంలో నాణ్యమైన బియ్యాన్ని ఉపయోగిస్తున్నాం. భోజనం నాణ్యతను తరచూ పరిశీలిస్తున్నాం.